# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ స్థానిక సంస్థల బలోపేతానికి సొంత ఆదాయ వనరులు పెంచుకోవడంపై అధికారులు దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.
- ❖ ట్రాన్స్ కో ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేసి నిర్మాణ వ్యయం తగ్గించాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు.
- ❖ పొట్టి శ్రీరాములు మహోన్నత వ్యక్తిత్వంతో అందరికీ ఆదర్శంగా నిలిచారని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు.
- ❖ వాయువ్య బంగాళాఖాతం, ఉత్తర ఒడిశా తీరంలో అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని భారత వాతావరణం కేంద్రం తెలిపింది.

========================

స్థానిక సంస్థల బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఆర్థిక సహాయంతో పాటు సొంత ఆదాయ వనరులు పెంచుకోవడంపై అధికారులు దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులు అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రితో ఈ రోజు సమావేశమయ్యారు. స్థానిక సంస్థల బలోపేతానికి ఆర్థిక-ఆర్థికేతర అంశాలపై ఆర్థిక సంఘం సిఫార్సులు చేసింది. ఆ సిఫార్సులను ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... పంచాయతీల అభివృద్ధికి ఏటా ఉపాధి హామీ నిధులతో సహా వివిధ రూపాల్లో సమకూరుతున్న నిధుల మొత్తాన్ని లెక్కించాలని తెలిపారు. వెనుకబడిన, తలసరి ఆదాయం తక్కువ ఉన్న స్థానిక సంస్థలను వర్గీకరించాలని, దీంతో వాటికి ప్రత్యేక సహాయం అందించే వీలు కలుగుతుందన్నారు. స్థానిక సంస్థలు స్వయం సమృద్ధి సాధించేలా అధికారులు పనిచేయాలని, పట్టణ స్థానిక సంస్థలనూ ఆర్థికంగా బలోపేతం చేస్తూ, మరిన్ని ఆదాయార్జన మార్గాలను అన్వేషించాలని అన్నారు. స్థానిక సంస్థల వర్గీకరణ ప్రక్రియను నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలని సమావేశంలో పాల్గొన్న ఉపముఖ్య మంత్రి కె.పవన్ కల్యాణ్ సూచించారు.

========================

ట్రాన్స్ కో ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేసి నిర్మాణ వ్యయం తగ్గించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ట్రాన్స్ కో అధికారులతో మంత్రి ఈ రోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపం లేకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు. 6 వేల కోట్ల రూపాయలతో చేపట్టిన ప్రాజెక్టులు 2027 నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాజధాని ప్రాంతంలో అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థపై మంత్రి ఆరా తీశారు. సీఆర్డీఏ పరిధిలో నిర్వహించే పనులకు అత్యాధునిక సాంకేతికతను వినియోగించాలన్నారు. విద్యుత్ శాఖలో ఖాళీల భర్తీకి ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేసినట్లు మంత్రి రవి కుమార్ అధికారులకు స్పష్టం చేశారు.

=========================

పొట్టి శ్రీరాములు మహోన్నత వ్యక్తిత్వంతో అందరికీ ఆదర్శంగా నిలిచారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ఈ రోజు రాజధాని అమరావతి ప్రాంతంలో 6.8 ఎకరాల విస్తీర్ణంలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహం, ఆడిటోరియం, మ్యూజియం, స్మృతివనం నిర్మాణాల శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ తో కలసి ఆయన పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ...

(వాయిస్ 32 సెకన్లు)

=========================

నీతి ఆయోగ్ ఎంపిక చేసిన ఆకాంక్షిత మండలాల అభివృద్ధికి నూతన ఆలోచనలతో కూడిన ప్రతిపాదనలను రూపొందించాలని కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. ఈ రోజు ఆకాంక్షిత మండలాల అభివృద్ధి అంశంపై నీతి ఆయోగ్ సీఈవో బి.వి.ఆర్.సుబ్రహ్మణ్యం దృశ్య మాధ్యమ విధానంలో ఆయా జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశ అనంతరం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఆకాంక్షిత మండలాలైన హోళగుంద, మద్దికెర, చిప్పగిరి మండలాలను మరింత అభివృద్ధి చెందేందుకు వీలుగా ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. విద్యాభివృద్ధి, పోషక విలువలు, జీవన ఉపాధి పెంపు, వైద్య, ఆరోగ్య సౌకర్యాలు మెరుగు పరచేందుకు సమగ్రమైన ప్రతిపాదనలు సిద్ధం చేస్తే నిధులు కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని కలెక్టర్ పేర్కొన్నారు.

=========================

రాష్ట్ర రహదారులు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఈ రోజు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలో కోల్‌కతా – చెన్నై హైవే (NH-16)లో జరుగుతున్న రహదారి నిర్వహణ పనులను పరిశీలించారు. రహదారి అభివృద్ధిలో వినియోగిస్తున్న మెటీరియల్ నాణ్యత ప్రమాణాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణలో జాతీయ రహదారి అధికారుల నిర్లక్ష్యంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దిష్ట గడువు లోగా పనులను పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు.

విరామం

=========================

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలోని ఆసుపత్రిల్లో సేవ చేసేందుకు భక్తులకు అవకాశం కల్పిస్తున్నామని ఛైర్మన్ బీ.ఆర్. నాయుడు వెల్లడించారు. ఈ రోజు తిరుమలలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఈవో శ్యామలరావుతో కలిసి ఆయన మాట్లాడారు. ఆసుపత్రుల్లో సేవ చేయాలనుకునే భక్తులకు 'శ్రీవారి సేవ ట్రైనర్' పేరుతో మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. తిరుపతిలోని స్విమ్స్, బర్డ్ ఆసుపత్రుల్లోనూ వారి సేవలు వినియోగించుకుంటామని తెలిపారు. అదేవిధంగా తిరుమలలోని జనతా క్యాంటీన్లకు టెండర్లు ఆహ్వానిస్తామని బిఆర్ నాయుడు వివరిస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

========================

రైతులకు పంట రుణాలను 24 గంటల్లో అందిస్తున్నామని శ్రీకాకుళం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ సివ్వాల సూర్యనారాయణ వెల్లడించారు. శ్రీకాకుళంలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ సంవత్సరం ఇప్పటి వరకు 600 కోట్ల రూపాయలు వివిధ రకాల ఋణాలను రైతులకు అందించామని, ఇందులో ఒక్క పంట రుణాలే 287 కోట్ల రూపాయలు ఉన్నాయని తెలిపారు. బ్యాంకు ఈ ఆర్థిక సంవత్సరంలో 2,600 కోట్ల రూపాయల టర్నోవర్ సాధించిందని, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రాధమిక వ్యవసాయ పరపతి సంఘాలను పూర్తిగా కంప్యూటరీకరించామని చెప్పారు.

========================

డ్వాక్రా మహిళా సంఘాలకు అందుతున్న రుణాలపై ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు సమీక్ష నిర్వహించారు. స్త్రీ నిధి ఎండీ హరి ప్రసాద్, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఎండీ తేజ్ భారత్ ఈ సమీక్షకు హాజరయ్యారు. మహిళా సంఘాలకు అందుతున్న రుణాల మంజూరులో ఆలస్యం జరుగకుండా చూడాలని దినకర్ వారికి సూచించారు. నకిలీ డ్వాక్రా సంఘాల పేరుతో గతంలో రుణాలు తీసుకున్న అంశంపై అధికారులతో చర్చించి, వారిపై తీసుకున్న చర్యలను గురించి అడిగి తెలుసుకున్నారు.

========================

చిత్తూరు జిల్లా కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ రోజు గారధోత్సవం వేడుక జరిగింది. స్వామి వారికి ఆలయంలో నిత్య కైంకర్యాలు నిర్వహించి, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి రథంపై పురవీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాటాలు, చెక్కల భజనల నడుమ రధోత్సవం వైభవంగా సాగింది.

========================

వాయువ్య బంగాళాఖాతం, ఉత్తర ఒడిశా తీరంలో అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని, రానున్న 24 గంటల్లో ఉత్తర ఒడిశా, దానిని ఆనుకుని ఉన్న జార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ మీదుగా పశ్చిమ వాయువ్య దిశగా ప్రయాణించే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎం.వెంకటరావు వెల్లడిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాలతో ముగిశాయి. ఉదయం 80,157 పాయింట్ల వద్ద ప్రారంభమైన సెన్సెక్స్.. చివరకు 409 పాయింట్లు లాభపడి 80,567 వద్ద ముగిసింది. నిఫ్టీ 115 పాయింట్లు పెరిగి 24,694 వద్ద స్థిరపడింది.

========================
========================